క్లుప్తంగా

ఏడుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

చేబ్రోలు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శుక్రవారం అందజేశారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఎంపీ రామరాజు తెలిపారు.

23న అంజుమన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



పొన్నూరు: పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీఖానాలో ఈ నెల 23వ తేదీన పొన్నూరు అంజుమన్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షులు మగ్బుల్ బేగ్ తెలిపారు. శుక్రవారం షాదీఖానాలో కార్యవర్గ ప్రమాణస్వీకారం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమానికి కార్యదర్శి షేక్ బాజీ అధ్యక్షత వహించారు. మగ్బుల్ బేగ్ 44 మందితో కమిటీ ప్రమాణం చేయడం జరుగుతుందన్నారు. ముస్లింల సంక్షేమం కోసం పనిచేసే ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు షేక్ మహమూద్, ఉపాధ్యక్షులు మొల్లా నసీరుద్దీన్, సహాయ కార్యదర్శులు షేక్ మౌలాలి, షేక్ అబ్దుల్ మజీద్, కోశాధికారి మొహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

గుంటూరు రూరల్: మండలంలోని ఓబులునాయుడుపాలెం సమీపంలోగల శ్రీరామగార్డెన్స్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులు పగలగొట్టి ఆలయంలోని అమ్మవారి మెడలోని బంగారు ఆభరణాలను చోరీ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం చోరీఘటన తెలిసిన స్థానికులు నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అమ్మవారి మెడలోని రూ.40 వేల విలువ చేసే బంగారం గొలుసు అపహరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు వేసుకుని చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నల్లపాడు సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్కరు తాము నివాసముంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్తను ఊడ్చి శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఎంటీఎంసీ అదనపు కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎంటీఎంసీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేడు భవన్స్ సాంస్కృతిక, లలిత కళల అకాడమీ ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్‌ఆర్ట్స్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు పాఠశాల కమిటీ కార్యదర్శి పి. రామచంద్రరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ విద్యా భవన్స్ ప్రాంగణంలోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి చేతుల మీదుగా అకాడమీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంగీత, నాట్య, లలిత, జానపద కళల వంటి మన దేశ సంప్రదాయ, సాంస్కృతిక కళలను భావితరాలకు అందజేసి, వాటి వైభవాన్ని, ఔన్నత్యాన్ని తెలియజేయడమే ధ్యేయం సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ప్రభుత్వ సంగీత నాటక పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు, నాట్యాచార్యులు డాక్టర్ కాజా సుబ్రహ్మణ్య శాస్త్రి పాల్గొంటారని పేర్కొన్నారు.





పైప్‌లైనుకు లీకులు.. వృథాగా నీరు

వేసవికాలంలో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. పలు ప్రాంతాల్లో నీరు వృథా అవుతోంది. నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలోని ప్రధాన పైప్‌లైనులకు లీకులు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం నీటి సరఫరా సమయంలో లీకుల ద్వారా పెద్ద ఎత్తున రోడ్డుపైకి వృథాగా నీరు పోతోంది. కొంతకాలంగా ఈ సమస్య ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

– పొన్నూరు

కూటమి పైశాచికత్వానికి యువకుడు బలి



పంది గోపీకృష్ణ

పెదకాకాని: కూటమి పైశాచికత్వానికి యువకుడు బలైన ఘటన గుంటూరు జిల్లా పెదకాకానిలో చోటుచేసుకుంది. స్థానికుల నుంచి సేకరించిన సమాచారం.. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు, పెదకాకాని, కొప్పురావూరు గ్రామాల్లో ఈనెల 16వ తేదీన ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన రోడ్లకు ప్రారంభోత్సవాలు చేయడంతోపాటు నూతనంగా నిర్మించాల్సిన రోడ్లు, కల్వర్టులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెదకాకాని సుందరయ్యకాలనీలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంతవరకూ బాగానే ఉంది. కానీ అదే కాలనీలో మొదటి నుంచి అధికారి పార్టీకి అండగా నిలిచిన పంది గోపీకృష్ణ, మరికొందరు యువకులు ఫ్లెక్సీల్లో ఫొటోలు లేకపోవడంపై స్థానిక నాయకులను నిలదీశారు. దీనిపై స్వల్ప వివాదం కావడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన రోజు రాత్రి కాలనీలోని పలు ఫ్లెక్సీలు చించివేశారు. దీంతో ఆగ్రహించిన స్థానిక నాయకులు సోమవారం నలుగురు యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుందరయ్యకాలనీకి చేరుకుని అదేరోజు రాత్రి పంది గోపీకృష్ణతో పాటు మరో ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నాలుగో యువకుడు తప్పించుకోవడంతో స్టేషన్‌కు తీసుకెళ్లిన ముగ్గురిని తమదైన శైలిలో విచారించారు. పార్టీ కోసం పనిచేసిన తమ ఫొటోలు ఫ్లెక్సీలో లేకపోవడంతో తామే ఫ్లెక్సీ చించామని వారు అధికారి వద్ద నిజాయితీగా ఒప్పుకున్నారు. అయినప్పటికీ కూటమి నాయకుల ఫోన్ ఒత్తిడి మేరకు పోలీసు సిబ్బంది తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. రెండో రోజు మంగళవారం కూడా స్టేషన్‌కు రావాలని వార్నింగ్ ఇచ్చి పంపించారు. రెండో రోజు కూడా పోలీసుస్టేషన్‌కు నలుగురిని పిలిపించి కూర్చోబెట్టారు. ఎప్పుడూ పోలీసుస్టేషన్‌కు రాని వారిని ఫ్లెక్సీ చించడంపై స్టేషన్‌కు తీసుకురావడం, తిప్పడం, కౌన్సెలింగ్ ఇవ్వడంతో మనస్తాపం చెందారు. వీరిలో పంది గోపీకృష్ణ గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తల్లి జ్యోత్స్న, తమ్ముడు చింటు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న గోపీకృష్ణ మరణించాడు. తండ్రి సాంబశివరావు సుమారు ఆరేళ్ల కిందట మృతి చెందాడు.

లోపాలున్న చిన్నారులపై అప్రమత్తంగా ఉండండి

తెనాలి వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి



చిన్నారులను ఆడిస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిఅర్బన్: జన్యుపరమైన లోపాలతో జన్మించిన చిన్నారులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డైక్ సెంటర్‌లో శుక్రవారం తల్లిదండ్రులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన సమయంలో తల చిన్నగా ఉండటం, ఎదుగుదల, నడక, మాట లేకపోవడం వంటి లోపాలతో కొందరూ జన్మిస్తుంటారని చెప్పారు. అలాంటి వారికి డైక్ సెంటర్‌లో చికిత్స అందించడం జరుగుతుందన్నారు. వైద్యులు ఇచ్చిన మందులను సకాలంలో వాడటంతో పాటు వారి సూచనలను తల్లిదండ్రులు తప్పక పాటించాలన్నారు. అలా చేయడం వలన పిల్లల్లో చాలా వరకు మార్పు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డైక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, సీనియర్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రామానుజరావు, డైక్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలెక్స్ ఆడదోమ వల్లే బోధ వ్యాధి

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి



కిట్‌లు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: క్యూలెక్స్ ఆడదోమ వలన బోధ వ్యాధి వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. బోధ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం వారు పంపిణీ ఫైలేరియా కిట్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, కిట్లను పంపిణీ చేస్తుందని చెప్పారు. తెనాలి పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలకు 282 ఫైలేరియా కిట్లను అందజేయడం జరిగిందని, వాటిని సంబంధిత వైద్యాధికారులకు రోగులకు అందజేస్తారని చెప్పారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ గజ్జల్లో, చంకలో బిళ్లలు కట్టి జ్వరం రావడం, కాలు చేతులు వాపులకు గురవడం, ఎర్ర చారాలు కనిపించడం వంటివి బోధ వ్యాధి లక్షణాలన్ని చెప్పారు. బోధ వ్యాధితో బాధపడే వారికి ఆరు నెలలకు ఒకసారి డీఈసీ, ఆల్బెన్డజోల్ మాత్రాలు వేసుకోవాలని సూచించారు. బోధ వ్యాధిగ్రస్తులు చేయాల్సిన వ్యాయామాలు స్వయం సంరక్షణ పద్ధతులను సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ తెలియజేశారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బోధవ్యాధి కాళ్ళకు, చేతులకు హైడ్రోసిల్ (వరిబీజం), రొమ్ము, జ్ఞానేంద్రియాలకు సోకే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారులు శివగణేష్, వంగాల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా అధికారులు తిరువీధుల శివరామ్‌ప్రసాద్, మున్నంగి రత్నాకరరావు, షేక్ బషీద్, బండారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

గుంటూరు మెడికల్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైద్య కళాశాల ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ప్రతి నెలా ఉద్యోగులకు పెండింగ్ బకాయిలపై షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. 12వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఐఆర్ 28 శాతం తక్కువ కాకుండా ప్రకటన చేయాలని తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు బిల్లు కూడా చెల్లించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావుకు ఘన నివాళి



పొన్నూరు: పొన్నూరు మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు శిష్య బృందం ఆధ్వర్యంలో వెంకట్రావు వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిడుబ్రోలులోని చిట్టినేని వెంకటరావు మున్సిపల్ పార్కులోని చిట్టినేని వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు అందజేశారు. కసుకర్రులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆకుల శివయ్య, ఆకుల వెంకటేశ్వరరావు, జక్కా రవీంద్రనాథ్, ఆలపాటి దేవేంద్రనాథ్, యామిని శ్రీహరి, దొప్పలపూడి వాసు, దిలీప్, నూతలపాటి శ్రీను, రమేష్, ఊక శ్రీను, బుడ్డయ్య, బొలిశెట్టి రోశయ్య, గుమ్మడి బ్రహ్మం, బ్రిటిష్ నాగేశ్వరరావు, బొందలపాటి శ్రీను, యరసాని ముసలయ్య, కొసరాజు రవీంద్ర పాల్గొని చిట్టినేని సేవలను కొనియాడారు.

దంత సంరక్షణపై దృష్టి సారించాలి



గుంటూరు మెడికల్: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని గుంటూరు జీజీహెచ్ డైక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.దీప్తి అన్నారు. డైక్ సెంటర్‌లో(జిల్లా సత్వర చికిత్సా కేంద్రంలో) వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వలన ప్రతి ఒక్కరిలో దంత సమస్యలు బాగా పెరిగిపోతున్నాయని వివరించారు. ప్రాథమిక దశలోనే దంత సమస్య గుర్తించి చికిత్స చేయకపోతే దంతాలు తీసివేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు పూటలా బ్రెష్ చేయాలని, ఆహార తీసుకున్న వెంటనే పుక్కిలించి ఊయాలని, ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు టూత్ బ్రెష్, పేస్టులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డైక్ సెంటర్ మేనేజర్ పావులూరి నాగశిరీష పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గోపీనాథ్‌కు సన్మానం



గుంటూరు వెస్ట్(క్రీడలు): జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పొన్నగంటి చంద్ర గోపీనాథ్‌ను రిటైర్డ్ ఎస్పీ సిహెచ్.చక్రపాణి శుక్రవారం అభినందించారు. ఇటీవల ఖతార్‌లో జరిగిన షటిల్ టోర్నమెంట్ చక్కని ప్రతిభకనబరిచారు. ఈ నేపథ్యంలో ఏపీ కన్నెగంటి హనుమంతు స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానిచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

ఏడీఏ రామకోటేశ్వరి



మాట్లాడుతున్న పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి

చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని పొన్నూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రామకోటేశ్వరి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ సాగులో ఖర్చులు పెరిగి పోవటం, పంటలు సక్రమంగా పండకపోవడం వలన రైతులు నష్టాలతో పాటు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. రసాయన, క్రిమిసంహారక మందులు, ఎరువులు అధిక మోతాదులో వాడటం వలన భూ సారం దెబ్బతిని భూమి నిర్జీవంగా మారుతుందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అయిన ప్రేమానుసూన్, డ్రైసోయింగ్ పీఎండీఎస్‌లో విత్తనాలను వేయటం చాలా ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. ప్రధాన పంటకు ముందు 28 రకాల విత్తనాలను వేయటం వలన రైతులకు ఆదాయం చేకూరటంతో పాటు భూమిలో కర్బన్ శాతం పెరిగి సారవంతంగా తయారవుతుందని తెలిపారు. ఏపీఎం శ్రీ లక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ద్వారా ఆహారం తినటం ఆరోగ్యానికి మంచిదన్నారు. భూమి లేని వారు పెరటి తోటలు వేసుకుని కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. మండల సమైక్య అధ్యక్షురాలు మైలా గిరిజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలన్నారు. ప్రకృతి సాగుకు ప్రభుత్వ సహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైలా వెంకట రామరాజు, వీరలక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జి అభిలాష్ పాల్గొన్నారు.

జీవీఆర్ఎస్‌లో ఫౌండేషన్ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: మండలంలోని బుడంపాడులోని జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ షేక్ కరిమున్నీసా తెలిపారు. బుధవారం ఎడ్యుబ్రిడ్జి ఫర్ ఎంప్లాయిమెంట్ సంస్థ ఆధ్వర్యంలో సీ ప్రోగ్రామింగ్‌పై సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించి, ప్రోగ్రామింగ్ ట్రైనింగ్, వంటి శిక్షణ అందిస్తారన్నారు. తద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలను సాధించేందుకు వీలవుతుందని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి సాంకేంతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భస్కర్‌నాయుడు, డీన్ డాక్టర్ బి వరప్రసాద్ పాల్గొన్నారు.

క్లాత్, జానపనార సంచులు ఉపయోగించండి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



క్లాత్ సంచులు ఉపయోగిస్తున్న వ్యక్తులను అభినందిస్తున్న ఏసీ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: పట్టణంలో 120 మైక్రాన్ల మందం తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను నిషేధించడం జరిగిందని, వాటి స్థానంలో క్లాత్, జనపర సంచులు ఉపయోగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం. లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. 10వ వార్డులోని ఒక షాపులో వస్తువులు కొనుగోలు చేసి వాటిని క్లాత్ సంచుల్లో తీసుకువెళ్తున్న క్షత్రి శ్రీనివాస్, చావాలి శ్రీరామమూర్తులను శుక్రవారం అభినందించారు. అందరూ ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెనాలి పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించడంపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నీటి కుంటలు ఏర్పాటు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవడం వలన భూగర్భ జలాలు అడుగంటవని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. కొత్తపేటకు చెందిన రామిరెడ్డి వెంకటరెడ్డి ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి కుంటలు, సేంద్రియ ఎరువు తయారీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయాల వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేసుకుని మొక్కలకు ఉపయోగించుకోవచ్చన్నారు. సేంద్రియ ఎరువు వలన మొక్కలు ఏపుగా పెరిగి మంచి దిగుబడిని అందిస్తాయని చెప్పారు. వీటిని ఏర్పాటు చేసిన వెంకటరెడ్డిని అభినందించారు.

నాణ్యతకు, మన్నికకు భారతి సిమెంట్



మేస్త్రీకి బీమా బాండ్ అందజేస్తున్న రాజశేఖరరెడ్డి, సురేష్, భవానీశంకర్

భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్. భవానీశంకర్

తెనాలిరూరల్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక జరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్. భవానీశంకర్ సూచించారు. పట్టణ లోయర్ వార్ఫ్ రోడ్డులోని సత్యదేవ ట్రేడర్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సును శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని తెలిపారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యమానులకు వివరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. మేస్త్రిల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ. లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. సత్యదేవ ట్రేడర్స్ యజమాని జి. రాజశేఖరరెడ్డి, ఇతర డీలర్లు, భవన నిర్మాణ మేస్త్రిలు, కార్మికులు పాల్గొన్నారు.

డ్రోన్లతో నిఘా

మంగళగిరి: డ్రోన్ల సహకారంతో అసాంఘిక శక్తుల ఆగడాలను అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల పాఠశాల, వీజే కళాశాల, ఆత్మకూరు జంక్షన్ వద్ద డ్రోన్ల సహకారంతో ట్రాఫిక్, ప్రమాదాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ల సహకారంతో ఒకే చోట నుంచి పరిస్థితులను సమీక్షించి, వెంటనే అదుపులోకి తీసుకురావచ్చన్నారు. రూరల్ పరిధిలోని అసాంఘిక శక్తులు, కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రతి రోజు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, పేకాట ఆడినా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

చేబ్రోలు: రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తూ ఢీ కొనటంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని వేజండ్లకు చెందిన షేక్ సుభాని, షేక్ రఫీ ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వస్తుండగా తెనాలి రోడ్డులోని రైసు మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సుభాని, రఫీలతో పాటు మరో ఏ రాజా అనే యువకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై హర్షం

తెనాలిటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు యావత్తు మాదిగ జాతి రుణపడి ఉంటుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చిలకా కిరణ్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి నేతలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సొపాటి కిరణ్, కోపల్లె శ్రీను, పినపాటి రత్నాకర్ పాల్గొన్నారు.